


విమానం మీద నుంచి తమ కళ్ల ముందే ఏదో కట్టుకొని, కిందకు దిగిన వ్యక్తి కొండరాళ్ల మధ్య పడి తలకు, మోకాళ్లకు, చేతులకు, గాయాలవడం చేత అలాగే స్పృహతప్పిపోవడం చూసి ముఖంమీద నీళ్లు చల్లి, ఉపచారాలు చేసి, గాబరాగా గణాచారి దగ్గరకు మోసుకుని వెళ్లారు గూడెం ప్రజలు.

వారం రోజుల తర్వాత నెమ్మదిగా, కష్టంగా కళ్లువిప్పాడు ఆ వ్యక్తి. అందరూ సంతోషంతో, ఆశ్చర్యంతో గుమిగూడారు. తమ గూడేనికి బయటి ప్రపంచానికి సంబంధం లేకపోయినా అతని దుస్తులు, వేషధారణ, ముఖవర్చస్సు చూసి తెలియకుండానే చాలా గొప్పవాడు, ధనికుడు అన్న భావం కలిగింది వాళ్లలో. అంతకుముందే, అందరూ తలా ఓ ప్రశ్నా అడిగేసరికి అతనికి ఏమీ అర్థం కాలేదు. ఇప్పుడే స్పృహ వచ్చిందని గుర్తుగా తలగాయం సలపటం మొదలుపెట్టింది. ఎక్కడున్నాడు తను? అసలు తన చుట్టూ అనాగరికులు, ఆటవికులు గుమికూడారేమిటి? ఏం జరిగింది? జ్ఞప్తికి తెచ్చుకునేందుకు, అర్థం చేసుకునేందుకు ప్రయత్నించసాగాడు. కానీ గాయాలు మగత లోనికి జార్చాయి, ప్రశాంతంగా అతను నిద్రపోవాలని, విశ్రాంతి కావాలని ఒక్కొక్కర్నే పంపేశాడు గణాచారి.

ఎప్పుడో ఇంటర్ మీడియట్‌లో సన్నిహితంగా ఉన్న మిత్రుడు, తరవాత ఇంజనీరింగ్‌లో కలిసి చదివినప్పుడు ప్రాణంగా మెదిలినవాడు పదేళ్ల తరవాత ధాదాపు మరచిపోయిన సమయంలో తిరిగి దగ్గరకొచ్చినట్లయింది. "వెంకట శేషు (వి.ఎస్) అండ్ ఇండస్ట్రీస్, ఫైనాన్స్, ఎస్టేట్స్, పాలిమర్స్ ఇలా అన్ని రంగాల్లో దేశంలోనే పేరున్న ఇండస్ట్రియలిస్ట్ ఎవరో అనుకున్నానని, ఈ మధ్య విదేశాల నుంచి ప్రముఖులకు ఆహ్వానం అందినప్పుడే పేపర్‌లో ఫోటో రావడంతో మన 'వెంకిగాడే' అని మిక్కిలి ఆనందభరితుడయ్యానని అప్పటి నుండి ఒక్కసారి కలవాలనుకుంటున్నానని, ఎంత ఎత్తుకు ఎదిగినా వెంకీ అమృత హృదయుడు, నిరాడంబరుడు అని విశ్వసిస్తున్నానని, మరచిపోడని, తప్పక అందర్ని కలిసినట్లు ఉంటుంది. అలాగే ఒక అకేషన్ అటెండ్ అయినట్లుంటుంది అని ఉత్తరం రాసి తమ్ముడి పెళ్లి కార్డు పంపాడు బండార్కర్, ఎన్నాళ్ల తర్వాత అనుకున్నాడు శేషు తనలో తాను, ఇంకా నాలుగురోజులు టైమ్ ఉండటం చేత సెక్రటరీని పిలిపించి ఆ రోజు ప్రోగ్రామ్స్ అన్నీ కాన్సిల్ చేయించాడు. హైదరాబాద్ నుంచి నాగపూర్ ఫ్లైట్‌కు టికెట్ రిజర్వు చేయించాడు. కొరియర్ సర్వీసులో తప్పక వస్తానని లెటర్ పంపించాడు. ఎందుకో కళ్లు చెమ్మగిల్లాయి. తెలియని ఉద్విగ్నత. ఆనందం పొంగిపొరలి చేతుల్లో తన్మయీ భావంతో కూడిన వణకు.

నిద్రలో ఒకవైపు ఒత్తిగిలడం చేత కాలుకు కట్టిన కట్టుకు నులక మంచం ఒరిపిడి కలిగి అబ్బా అని మూలిగాడు శేషు.

"లే నాయనా, నెమ్మదిగా లే, ఓపిక తెచ్చుకో.


బాబుగారికి ముఖం కడిగి కషాయం తాగించండి. ప్రశ్నలతో విసిగించకండి తలమీద గాయంతో మనిషి బాధతో ఉన్నాడు ఏమీ చెప్పలేకపోవచ్చు. గాయం తిరగతోడవచ్చు" అని ఒకరిద్దరి మనుషులకు చెప్పి బాగవుతావు త్వరలో అన్నట్లు సైగ చేసి వెళ్లాడు గణాచారి. వారం రోజులు గడిచింది నెమ్మదిగా కర్ర సాయంతో నడవసాగాడు శేషు. కాలు నెమ్మదిగా స్వాధీనంలోకి రాసాగింది. తన విషయాలేమీ చెప్పకపోయినా చుట్టూ అడవి, గూడెం మనుషులు బయటి ప్రపంచం తెలియనట్లున్న వాళ్ల స్థితి అర్థం చేసుకున్నాడు.

❄ ❄ ❄

చల్లగాలికని నెమ్మదిగా చెరువు గట్టుకు తీసుకెళ్లారు ఇద్దరు మనుషులు. చుట్టూ చెట్టూ చేమ, జన సంచారం లేని ప్రదేశం. మధ్యలో ప్రకృతిని అద్దంపట్టిందా అన్నట్లున్న చెరువు. హాయిగా ఎగరాలని అనిపించిదతనికి. పిల్లలంతా

మీ వారు పనిచేసే ఆఫీసులోని టైపిస్టు మీద అనవసరమైన అనుమానాలెందుకు? అడిగింది రాణి, జ్యోతిని...
ఆ... ఏంలేదు... ఒకప్పుడు నేనూ అక్కడ పని చేసిన దాన్నే

పురం సంతోష్
గట్టిపల్లి



ఉన్న గోచీలు కూడా విసిరేసి ఎగురుతూ, దూకుతూ ఆటలాడుతున్నారు నీళ్లలో. ఒకబ్బాయి ఇంకొక అబ్బాయి కొట్టుకోబోతుంటే పరుగెత్తుకుంటూ వచ్చి శేషు వెనక దాక్కొన్నాడు. ఒడ్డునే కూర్చోవడం చేత వాడికి కోపం వచ్చి నీళ్లని రెండు చేతుల్తో ఆ అబ్బాయిపైన పడాలన్నట్లు శేషునీ తడిపేశాడు రెండోవాడు. ఇంతలో వాళ్ల తండ్రి కాబోలు గదమాయించాడు. శేషు మాత్రం వారించి నవ్వి ఊరుకున్నాడు. నిజంగా బాల్యం ఎంతహాయి. ఇలా ప్రకృతి ఒడిలో ఏ మాత్రం కపటం తెలియక తనూ పెరిగాడు. ఉన్న ఊళ్లోనే టెన్త్ వరకూ చదివాడు. తండ్రి చిన్న రైతైనా, కష్టనష్టాలకు ఓర్చి చదివించాడు తనని. ఏనాడూ పొలంలోకి అడుగు పెట్టనివ్వలేదు. సెవెన్త్ క్లాస్‌లో తాలూకా ఫస్ట్ వచ్చినప్పటి నుండి మాష్టార్లూ, ఊళ్లోవాళ్లు, ప్రెసిడెంట్ అందరూ ప్రత్యేక శ్రద్ధ చూపే వారు తనంటే. ఏనాడో మన ఊరు పేరు దేశమంతటా మ్రోగేట్లు చేస్తాడోయ్ మీ వాడు అనేవాడు మునసబు. ఖర్చు కోసం చూడకోయ్ మేం సాయం చేస్తాం, మీ అబ్బాయి తప్పనిసరిగా ఇంజనీరు కావాల్సిందేనని కరణం గారనేవారు. అందుకేనేమో టెన్త్‌కి వచ్చిసరికే తనేదో దేశాన్నుద్ధరించాలని, చాలా పెద్దవాడినవ్వాలని అనుకునేవాడు. ఇంజనీర్‌ను అనుకుంటూ పులకించిపోయేడు. అదేమో స్పష్టంగా తెలియకున్నా ఏదో గొప్ప అనుకుని, కష్టపడి చదివేవాడు. వయసుకి మించిన ఆలోచనలు, క్రమశిక్షణ, కట్టుదిట్టం అలవాటు చేసుకున్నాడు. చిన్న చిన్న గొడవల్లో తలదూర్చటం, గోళీలాడటం మానేశాడు, చదరంగం, ఫుట్‌బాల్ అందుబాటులో ఉన్న స్టాండర్డ్ అనుకునే ఆటలే ఆడేవాడు. ముఖ్యంగా తెలివితేటలకు పదును అని చదరంగం, 'ఊళ్లో ఉన్న లైబ్రరీ సావాసం చేశాడు. ఇంటర్ వచ్చేసరికి నెమ్మది నెమ్మదిగా తెలియసాగింది పుస్తక ప్రపంచానికి లోకానికి -తేడా. కాలేజీలో పార్టీల వాళ్లు గొడవలు పడి ఆర్నెల్లు ఏదో ఒక బంద్. తనకు ఎక్కువ ఆసక్తి ఉండడం చేత ఏ ప్రశ్న అడిగినా అదేమో చొప్పదంటూ ప్రశ్న అన్నట్లు ఉపాధ్యాయులు హేళన చేయడం, విద్యార్థులు, లెక్టరర్లను బెదిరించడం. కొందరికి జడిసి, కొందరు తమ కులమని, కొందరు తమ దగ్గర ట్యూషన్ కొస్తున్నారని వాళ్లకు మార్కులేయడం తనలాంటి వాళ్లకు మాత్రం అతితెలివి అని బిరుదు తగిలించి, తోక కోస్తున్నామంటు తక్కువ మార్కులు వేయడం ఏదో ఇబ్బంది మొదలయ్యింది. తెలిసి పరిజ్ఞానముండి ఏదో కోల్పోతున్నామన్న బాధ లోలోపల మొదలైంది.

అప్పుడే భండార్కర్‌తో పరిచయమయ్యింది. తండ్రి రెండో పెళ్లి చేసుకోవడం చేత, నిరాదరణకు గురైనవాణ్ణి అమ్మమ్మ తన ఇంటికి తెచ్చుకొంది చదివించేందుకని చెప్పి. బహుశా బీదరికం, బాధ తమనిద్దరిని దగ్గర చేసిందేమో. ఏదో ఒక రోజు నా తెలివికి ఈ లెక్చరర్లే ఆశ్చర్యపోతారనీ, నేను తప్పక ఇంజనీర్ అవుతానని ఓదార్చేవాడు. కాని రెండు సంవత్సరాలలో కాలేజీ నడిచిందే ఆర్నెల్లయితే, ఎంత తెలివి ఉన్నా, అసలు ఎంట్రెన్స్ అంటేనే అప్పుడే తెలిసింది. రెండు నెలల చదువు, పట్టణాల వాళ్లతో పోటీ పడలేమని చెప్పింది. బండు మహారాష్ట్రవాడవడం చేత, ఇంకా కొందరు చెప్పడం చేత తలకు మించి భారమైనా లెక్క చేయక నాన్న మహారాష్ట్రకు పంపించాడు. అసలు విషాదం అక్కడ మొదలైంది. నరరూప రాక్షసులనిపించే సీనియర్స్, కనీసం మానవత్వంలేని వాళ్లు రాగింగ్‌లో అసలు వీళ్లేనా ఇంజనీర్లు, సొసైటీలో పెద్ద మనుషులు. ఛీ అనిపించింది. లెక్చరర్లకు ఎందుకో గాని ఎ.పి. వాళ్లంటేనే అసహ్యం, ఏదో ఫీలింగ్, రికార్డులు రాసిందే నాలుగు సార్లు ఏదో తప్పు చూయించి రాయమనడం నుంచి, వైవాల చిత్రహింస, ప్రాక్టికల్స్‌లో ఫెయిల్ చేయడం, బలిసి టైం పాస్ కొరకు చదివేందుకు వచ్చినారనడం, కట్నం కోసం చదువుతున్నారనడం, అక్కడ సీటొచ్చే తెలివిలేదు కాని ఇక్కడ ఫోజనడం, యూనివర్సిటీ ముద్రారాక్షసం క్షణక్షణం నరకం చూయించాయి. అసలు స్వాభిమానం ఉన్నవాడెవడూ సైన్స్ చదవొద్దనీ, స్వంత తెలివితేటలున్న వాడు సలాములు గొట్టే చదువు చదవొద్దనీ, ఎంత చదివినా లెక్చరర్ల అడుగులకు మడుగులొత్తినా ఏ క్షణం ముఖంలో పుట్టుమచ్చ ఒకటి ఎక్కువైందో, తక్కువైందో లెక్క పెట్టే ఏదో కారణం చూయించి ఫెయిలు చేసే చదువనీ విరక్తి పుట్టింది.

బండూ అనేవాడు, నీలాంటి వాడు నిజంగా చదువుకోవాలనుకునే వాడు, బాధంటే తెలిసిన వాడు అన్నీ తెలిసి అణగారిపోతున్నాడు. కనీస మానవత్వం లేని పశువుల బారినుండి కనీసం కొందరినైనా తప్పించాలంటే పళ్లబిగువున బాధనణచి మనం అభివృద్ధి చెందితే నీలాంటి ఇంకొకవాడు ఈ బాధ నుండి విముక్తుడవుతాడు, నీలాంటి వాళ్లకోసమైనా, వాళ్లు బలికాకుండా ఉండడం కోసమైనా నువ్వు సాధ్యమైంత ఎత్తుకు ఎదగాలి అని, కాని మహారాష్ట్రలో పర్సెంటేజి లేని కారణంచేత బయటపడేసరికి ప్రభుత్వోద్యోగాలకు అప్లై చేసుకునే అర్హత కూడా లేకుండా పోయింది. పెద్ద ఉద్యోగాల్లో తల్లితండ్రులుంటేనే ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగమని తెలిసింది. మహారాష్ట్రలో చదివినా వెక్కిరింతల ఇంటర్వ్యూల పర్వం తూట్లు పొడవడానికి హృదయంలో ఖాళీలేకుండా చేసింది. దిక్కూ దివాణం లేకుండా తిరిగి తిరిగి వైరాగ్యం వచ్చింది. అందులో నుండే అసలు ఇంజనీరింగ్ అంటే ఏమిటో తెలియవచ్చింది. తను స్వంతంగా ఒక ఫ్యాక్టరీ పెట్టగలిగి, ఇంకొకరికి జీవనోపాధి సృష్టించగలవాడే ఇంజనీర్ అని తెలిసి వచ్చింది. మళ్లీ ఒంటరి పోరాటం. ముందు ఎక్స్‌పీరియన్స్ కోసం అని సరిపెట్టుకొని కంటినీరు దిగమింగుకొని, నిర్లజ్జగా బస్ పాస్ వేతనం పైన కాళ్లావేళ్లాపడి ఒక కంపెనీలో చేరడం, రెండేళ్లు దూషణలు ఆశీస్సులనుకోవడం, మళ్లీ లోన్స్ స్కీమ్స్ కోసం అందరి చుట్టూ తిరిగి విసిగి అతి చిన్న పెట్టుబడితో పని మొదలు పెట్టవచ్చు అన్న అన్వేషణ. దానికి ఒక వ్యాపారస్తుణ్ణి ఒప్పించడం, ఎనిమిదేళ్ల నిరంతర శ్రమ. బహుశా తను నమ్ముకున్న నిజాయితీ, అన్నీ ఉండీ అణగారిపోతున్న వాళ్లు, స్వంత వ్యక్తిత్వం, తను తిని ఇంకొకరికి పెట్టాలనుకున్న పెద్దమనసున్న వాళ్లు, స్వయం ఉపాధి, ఒళ్లు వంచి పని చేయడం తెలిసిన వాళ్లు. తెలివి ఉన్నా అవకాశం లేక పట్టణాల వాళ్లతో పోటీకి తట్టుకునే స్థితి, పరిస్థితులు అనుకూలించని వాళ్లు; రెకమండేషన్, స్వంత పెట్టుబడి లేనివాళ్లు; ఏదో సాధించాలనుకున్నా ప్రభుత్వ యంత్రాంగంలో పని చేయని వాడికి అనుకూలించే రూల్సు, వీళ్లకు అడ్డు తగిలే రూల్సును తట్టుకోలేని వాళ్లు, రాజకీయాల వల్ల, పరిస్థితుల వల్ల ఎదురించలేక విదేశాలకు పారిపోయినవాళ్లు, కనీసం టెక్నాలజీ, నిజంగా అక్కడైనా నేర్చుకుందామనే వాళ్లు, అందరూ, టెక్నికల్ రంగంలోనే కాక అన్ని రంగాల్లో చేసిన అసిధారావ్రతమే దేశంలో పేరు మోసిన వి.ఎస్,. గ్రూప్.

"మీరు నిజంగా నిరాడంబర జీవితాన్నే కోరుకుంటారు గదా

మరి మనుకున్నది చాలదా ఇంకా ఎందుకీ అహర్నిశల పరుగు. మనిషికి ఎంత సాధించినా లిమిట్ ఉందా, కొంచెం సేద తీర్చుకోండి, గాలి పీల్చుకోండి అని పోరేది" తన భార్య. కాని తన సున్నిత హృదయం బీటలు వారింది ఏది సాధించినా దాన్ని నిజంగా గర్వంగా తలచే సమయం దాటిపోయిన తర్వాత ఏమి లాభం? బాధ తనను ఎంతగా దిగ

కోరిన కోర్కెలు తీర్చి, సమస్యలను పరిష్కరించే

## అద్భుత ఉంగరం



మీరేదైనా సమస్యలో చిక్కుకుని వుంటే అందుకు బాధపడాల్సిన అవసరం లేదు. మీరు మా అనుభవజ్ఞులైన సిద్ధాంతులతో పూజలు నిర్వహించి మంత్రించబడిన అద్భుత మహిమలు కలిగిన మహత్తర ఉంగరాన్ని ధరించండి. సమస్యలు పరిష్కరించబడడమే గాక మీరు తలచుకున్న కోర్కెలూ నెరవేరుతాయి. దీన్ని ధరించినా లేక వెంటవుంచుకున్నా మీరు తలచుకునే స్త్రీలైనా, పురుషులైనా ఆకర్షితులై లొంగిపోతారు. ఎవరి పేరయితే ఉచ్చరిస్తారో వారెంతటి రాతి గుండె వారైనా మీపాదాల మీద పడతారు. వ్యాపారంలో లాభం, పరీక్షల్లో విజయం, ఉన్నతపదవి, అంచెలంచెలుగా అభివృద్ధి, నచ్చిన వారితో పెళ్ళి జరుగుతాయి. అంతఃకలహాలు, వ్యాధులు, కష్టాలు, అప్పుల బాధనుండి విముక్తి, నీచ గ్రహ బాధలు తొలగి తలపెట్టిన కార్యాలు జయప్రదంగా నెరవేరతాయి. మానసికంగా, శారీరకంగా ఆనందం, ఆరోగ్యాల అనుకూలం జ్ఞాపకశక్తి వృద్ధి, వృత్తిలో రాణింపు వంటి సకల సౌభాగ్యాలు కలిగించే మహత్తు గల ఉంగరం రూ 41/-.

తమ పేరుకు తగినట్లుగా మంత్రించిన (తమకంటూ ప్రత్యేకించి తయారు చేయబడ్డ) వెండితో తయారు చేసిన ప్రత్యేక బాధా నివారిణి ఉంగరం రూ. 105/- అత్యధిక శక్తివంతమైన వశీకరణ (బంగారం, వెండి, రాగి మిశ్రమంతో) తయారైన ఉంగరం రూ.291/- పంచలోహ ఉంగరం రూ. 451/- తపాల ఖర్చు అదనం. మీరనుకున్నది 1,11,111 రోజుల్లో జరగకపోతే రెట్టింపు సొమ్ము తిప్పి పంపడంతో బాటు రూ. 1116/- ఉచితంగా పంపబడుతుంది. ఉంగరం పొందగోరువారు తమపేరు, అభిరుచి, రాశి, పుట్టినతేదీ, సమయం మొదలైన వివరాలు తప్పక వ్రాయాలి.

SANKAT HARAN ASHRAM(S 20
P.O. MAIRA-BARITH(GAYA)



## లైసెన్స్ అవసరంలేదు



200 గుండ్లు, తోలుకేసు ఉచితం

నాటకాలు, పిక్నిక్‌లు, దొంగల బారినుండి రక్షణ

ధర రూ. 215/-

తపాల మరియు పాకింగు రూ. 25/-.

మీ పేరు అడ్రసు వివరంగా వ్రాయండి.

**AJANTHA TRADERS (AT 2)**

**MAIRA - BARITH (GAYA)**


మింగిందంటే ఎంతటి విజయమైనా తనకు సంతృప్తిని, సంతోషాన్ని కలిగించడం లేదు. ఇటువంటి నరకం ఎంత తక్కువ మందికి వస్తే అంత మంచిది. అందరి బాధలను తను పోగొట్టలేను, కాని ఎవ్వరి బాధా చూడలేడు. సాధ్యమైనంత అందరికి చేయడంలోనే వాళ్లను హాయిగా చూడడంలోనే తృప్తి. ఇది వాళ్ల కోసం కాక తన కోసం చేస్తున్నాను అనేవాడు. అలాంటి ఇన్నేళ్ల తపన, కృషి, బూడిదలో పోసిన పన్నీరనిపించింది ఆ రోజు.

బందు వాళ్ల తమ్ముడి పెళ్లికని ఫంక్షన్ హాలుకి వెళ్లిన తర్వాత తెల్సింది. ఏదో కారణాల వల్ల పెళ్లి పోస్ట్‌పోనయ్యింది. అక్కడే జరిగే పెళ్లి దృశ్యంలో ఎవ్వరిదో తెలియని కాని అపశృతి, వి. ఎస్. గ్రూప్‌లో పని చేస్తున్నాడు కనుక రెండు లక్షల కట్నం డిమాండ్. కట్నం లేటయినందువల్ల ఆగిపోయే పరిస్థితి. నిజంగా చైతన్యరహితుడనయ్యాను, కాలం స్తంభించినట్లయింది. తన పిచ్చి గాని మనిషి కొంత కాలం మాత్రమే మానవత్వం ఉన్నట్లు ప్రవర్తిస్తాడు. అసలు పుట్టింది పశువు నుంచే అన్నది నిత్య సత్యం, పశువు అని అంటే బహుశా పశువుకే సిగ్గేస్తుందేమో. తన తల్లితండ్రులు, అక్కాచెల్లెళ్లు, స్నేహితులు, బంధువులు బాధపడేది చూసినా తనకు కొంచెం కానివాళ్లనైనా, తనతో జీవితం పంచుకుందామనే వాళ్లనైనా కనికరించడు. ఏ విధంగానైనా ఏ రంగంలోనైనా ప్రక్కవాడిని పడేసి, తొక్కేసి, ఆ రక్తపు కూడుతో పైకి రావాలనుకుంటాడు. ఛా వీళ్లకోసమా నేను ఇంతకాలం బాధపడ్డది తలకు మించి భారం వేసుకున్నది. నిద్రాహారాలు మానుకున్నది. అపాత్రదానమన్నది అన్నిటికంటే మహాపాపం. ఏం జీవితం. నిర్లిప్తంగా నడిచాను. ఫ్లైట్‌లోనే ఆశను నిరాశ గెల్చింది. ఆలోచనలు ఎడతెరిపి లేకుండా నిస్సారమైన బ్రతుకని తేల్చేశాయి. మధ్యలో ప్రమాదంలో విమానం కాలడం మొదలయ్యాక ఎవ్వరో ప్యారాచూట్‌తో తోసెయ్యడం, ఎక్కడో పడడం లీలగా గుర్తుంది. కాని తనెవ్వరో ఏమిటో ఎవ్వరికీ చెప్పదలచుకోలదు. ఇక్కడే కల్మషంలేని మనుషుల మధ్య హాయిగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. బహుశా ఇప్పటికి తన కోసం అందరూ వెతుకుతూ ఉంటారు. నెల దాటేసరికి ఏమి తోచని పరిస్థితిలో ఉండి ఉంటారు. పాపం పిల్లలు, జయా ఎంత రోదిస్తున్నారో! అయినా మనిషి నెమ్మదిగా రొటీన్‌లో పడితే మరపు సహజం. వాళ్లకన్నీ అందుబాటులో ఉన్నాయిగా. ఏదో వెలితి. అయినా అదే తుది నిశ్చయం.

❄ ❄ ❄

చెరువు దగ్గర నుండి వచ్చేసరికి సంధ్య వెలుగులో అందరూ ఓ దగ్గర గుమిగూడారు. ఎవరో స్వామీజీ వచ్చాడు. లీలగా అతని గంభీరస్వరం నుండి అమృత వాక్కుల ప్రతి ధ్వని తన హృదయాంతరాళాల్లోకి ప్రసరించింది.

అశోచ్యా నన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే గతా సూనతగా సూంశ్చ నాను శోచన్తి పండితాః

దుఃఖింప దగని వారిని గూర్చి నీవు దుఃఖించుచున్నావు. పైగా పండిత వచనములను పలుకుచున్నావు. పండితులగు వారు గతించిన వారిని గూర్చి గాని, జీవించియున్న వారిని గూర్చి గాని దుఃఖింపరు.

సముద్రంలో కొట్టుకుపోతున్న వాడికి పడవ తెరచాపకు కట్టిన తాడు దొరికిన సంబరం. అంతర్మథనం ప్రారంభమైంది.

కర్మణ్యే వాధి కారస్తే మా ఫలేషు కదాచన
మా కర్మఫల హేతుర్భూర్మాతే సంగోస్త్వ కర్మణి.

నీకు కర్మ చేయుట యందే అధికారము కలదు. కర్మ ఫలము నందు ఆశవద్దు, కర్మఫలమునకు నీవు కారణభూతుడవు గాకుము, అలాగని కర్మలను వదలుట యందు ఆసక్తి జూపకుము.

మనసు తేటతెల్లమై ఏదో శక్తి ముందుకు నడిపించింది. ఆటంకాలను పట్టించుకోక, ఆచరణలోనే నిమగ్నమవ్వాలని ఉత్తేజితమైంది. పునర్జన్మ నిచ్చిన గూడెం ప్రజల మంచితనాన్ని ప్రపంచానికి పంచాలే పయనం ఆరంభమయ్యింది.

❄ ❄ ❄